
# ఒక కధ




**అనగనగా ఒకరాజు, ఆరాజుకి ఏడుగురు కొడుకులు....**

**అలాంటి కధ కాదు యిది. మరి?? ఒకప్రేమకధ...**

**అమ్మాయి-అబ్బాయి ప్రేమకధ కానే కాదు.**

**ప్రేమరాహిత్యంలో జన్మించి అందరికీ ప్రేమని పంచుతున్న ఒక సామాన్యమైన ప్రేమమూర్తి కధ.**

**చదవండి ....**

ఇన్‌పేషంట్స్ జనరల్ వార్డ్ రౌండ్స్ ముగించుకుని తన రూమ్‌లోకి వచ్చాడు డాక్టర్ గౌతమ్. అతను కొత్తగా ఆ వూరి ప్రభుత్వ హాస్పటల్‌లో చేరాడు. ఆ వూరు ఓమాదిరి బస్తీ. చుట్టుపక్కల గ్రామాల నుండి యెక్కువగా పేషంట్స్ వస్తుంటారు. రైతు కుటుంబాలవాళ్లు కూలిపనులు చేసుకునేవాళ్లు; చదువు తక్కువ వాళ్లకి. వాళ్లకి అర్థం అయ్యేలా అన్నీ వివరించి చెప్పడం గౌతమ్‌కి చాలా కష్టంగా వుంది. “వర్రీ అవకండి డాక్టర్! కొన్నాళ్లకి మీకు అదే అలవాటవుతుంది” సీనియర్ డాక్టర్స్ అతనికి మెల్లిగా నచ్చచెప్పారు. ఐనా అతనికి మనసు కుదుటపడడం లేదు. ఈరోజు ఒక ఇన్‌పేషంట్ నిజంగా గౌతమ్‌ని చాలా ఇబ్బంది పెట్టేశాడు. మూడురోజుల క్రితం హైఫీవర్‌తో ఆడ్మిట్ అయ్యాడు. ఆ టైములో వెంట వెంటనే ఇంజక్షన్స్ యిస్తేకానీ టెంపరేచర్ కంట్రోల్ కాలేదు. తరవాత ఇంజక్షన్స్ మానేసి టాబ్లెట్స్ మొదలుపెట్టాడు గౌతమ్. ఆపేషంట్‌కి అది నచ్చలేదు. సూదిమందు వేయకుండా వట్టిమాత్రలు యిస్తూ డాక్టర్ తనకి అన్యాయం చేస్తున్నాడని ఒకటే గోల మొదలుపెట్టాడు. పేషంట్ భార్య కూడా అసంతృప్తిగా మాట్లాడింది. ఏం చెయ్యాలో తోచక గౌతమ్‌కి తలదిమ్ము వచ్చింది. ఇంతలో పక్కవార్డ్ లోని వార్డ్ బోయ్ వచ్చాడు. "ఏమిటి అక్కా! గొడవ?" అని సిస్టర్‌ని అడిగి విషయం తెలుసుకున్నాడు. మెల్లిగా గౌతమ్ దగ్గరికి వచ్చి “డాక్టర్‌సార్! మీరు వెళ్లండి. నేను వీళ్లకి చెప్తాను కదా” అన్నాడు.

హమ్మయ్యా! అనుకుంటూ పక్కబెడ్ దగ్గరికి వెళ్లాడు. ఆ వార్డ్ బాయ్ ఆపేషంట్‌కి యెలా నచ్చచెప్తాడా అని కుతూహలంతో పక్కనే నిలబడ్డాడు గౌతమ్. “చూడు బాబాయ్! నీకు జ్వరం యెక్కువగా వున్నప్పుడు యీ డాక్టర్‌బాబు నీకు సూదిమందులు వేసి జ్వరం తగ్గించారు కదా”. “అవునయ్యా ఆబాబు దేవుడు” ఆపేషంట్ చేతులెత్తి దణ్ణం పెట్టాడు. “అవునుకదా మరి ...యింకా సూది పొడిచారనుకో జ్వరం యింకా యింకా తగ్గిపోయి నీకు నీరసం వస్తే” నవ్వుతూ అన్నాడు. “వామ్మో” అంటూ గుండె బాదుకుంది పేషంట్ భార్య. “కదా! యెప్పుడు యేమందు యివ్వాలో ఆయనకి తెలుసు. డాక్టర్‌బాబు పెద్దపెద్ద పుస్తకాల్లో యివన్నీచదువుకుని మనకి వైద్యం చేస్తున్నారు బాబాయ్! ఆయన కన్నా మనకి యెక్కువ తెలుసా! తెలియదు కదా.” మెల్లిగా సౌమ్యంగా అన్నాడు. “అవునయ్యా! చదువు రాని వాళ్లం.” అంటూ భార్యాభర్తలు చెంపలువేసుకున్నారు. ఇంత సూక్ష్మంగా విడమర్చిచెప్పిన ఆవార్డ్ బోయ్ యెవరా అని పక్కనవున్న సిస్టర్‌ని అడిగాడు.

“అతని పేరు పోతురాజు డాక్టర్!” పొడుగ్గా కాస్త నల్లగా ... పెద్దపర్సనాలిటీ పోతురాజుది. మెలితిరిగిన మీసాల్తో చూడ్డానికి పోతురాజు లాగే వుంటాడు. కానీ మాట సౌమ్యం, మనసు మెత్తన. రూములో కూర్చున్న గౌతమ్‌కి తలదిమ్ము యెక్కువైంది. వెళ్లి ఔట్‌పేషంట్సుని చూడాలి. ఈలోగా కాస్త టీ తాగుదామనిపించింది. బెల్ నొక్కాడు. సిస్టర్ రాగానే “సిస్టర్ కాస్త టీ దొరుకుతుందా?” అని రెక్వెస్ట్ గాఅడిగాడు. “అలాగే డాక్టర్!” గుమ్మందాకా వెళ్లి “పోతురాజూ!” అని పిలిచింది. “అక్కా!” అంటూ పరిగెట్టుకుని వచ్చాడు పోతురాజు. అతను “అక్కా!” అని పిలవడం విని గౌతమ్‌కి నవ్వు వచ్చింది. “ఏం డాక్టర్! నవ్వుతున్నారు.” సిస్టర్ అడిగింది. “అతను అలా వరసలు పెట్టి పిలుస్తూంటే నవ్వు వచ్చింది” అన్నాడు. “అదా అతను అందర్నీ అలాగే పిలుస్తాడు” గొతమ్‌కి పోతురాజు కాస్త తేడాగా అనిపించాడు.

రోజులు గడుస్తున్నకొద్దీ అతని మంచితనం అతని ప్రేమించే హృదయం అర్థం అవసాగింది. పోతురాజు యేవార్డ్ లోవుంటే అక్కడి పేషంట్స్ నిశ్చింతగా వుంటారు. అందర్నీ వారివారి అవసరాలబట్టీ ఆదుకోవడమే అతని స్వభావం. ‘ఇంతవరకే నాడ్యూటీ’ అని యెప్పుడూ అతను గిరి గీసుకోలేదు.

ఎదుటివారి వయసు బట్టీ అక్కా, అన్నా, బాబాయ్ అంటూ నోరారా పిలిచే పోతురాజుకి తన స్వంతం అంటూ యెవరూ లేరు. ఇదే హాస్పిటల్‌లో పుట్టిపెరిగిన పోతురాజు యీహాస్పిటల్‌ని యిక్కడి స్టాఫ్ మరియు వచ్చే పేషంట్స్ ని తన స్వంతం చేసుకున్నాడు. ఇదే అతని ప్రపంచం.

ఒకరోజు గైనిక్‌వార్డ్ లో అతని డ్యూటీ. ఒకయిల్లాలు నొప్పులు పడ్తోంది. ఇంకా టైము వుందని ఆమెని లేబర్‌రూమ్‌కి తీసికెళ్లలేదు. డాక్టర్ కూడా నర్సులకి చెప్పి లంచ్‌కి వెళ్లింది. ఇంతలో హఠాత్తుగా ఆమెకి నొప్పులు యెక్కువయ్యాయి. పురుడు యిక వచ్చేస్తుందని ఒకనర్సు ఖంగారుగా డాక్టర్‌ని పిలవడానికి పరిగెట్టుకుని వెళ్లింది. ఇంకొకనర్సు ఆగర్భిణీని లేబర్‌రూమ్‌కి తీసికెళ్లాలని గాభరా పడ్తోంది. స్టెచ్చర్ తెచ్చే టైమ్ లేదు. నొప్పులకి ఆగర్భిణీ కేకలు పెట్టేస్తోంది. ఇంతలో పోతురాజు ఆమె బెడ్ దగ్గిరికి వచ్చాడు. మృదువుగా ఆమెని చేతులమీదకి యెత్తుకుని పడుకొపెట్టుకున్నాడు. ఆమె కెవ్వుమని అరిచి అతనిచొక్కా గట్టిగా పట్టుకుంది. వార్డ్ మొత్తం తెల్లబోయింది. “ఖంగారు పడకు చెల్లమ్మా! చందమామ లాంటి బిడ్డని కంటావు. కాస్త ఓర్చుకో తల్లీ” అంటూ ఆమెని యెత్తుకుని లేబర్‌రూమ్‌లోకి వెళ్లాడు. తేరుకున్న నర్సు అతని వెనకాలే పరుగున వెళ్లింది. ఆవెంటనే డాక్టర్ నర్సు కూడా వచ్చారు. ఓఅరగంటకి ఆమెకి సుఖప్రసవం అయింది.

“ఎంత సాహసం చేశావు పోతురాజూ!” డాక్టర్ తరవాత అతన్ని మందలించినట్లు అంది. “ఏమోనమ్మా! ఆయిల్లాలి నొప్పులబాధ , అక్కఖంగారూ చూడలేకపోయాను. చెల్లాయిని లేబర్‌రూమ్‌లో తీసికెళ్తే మంచిదనిపించింది.” మెల్లిగా అన్నాడు. “అవునులే కరక్టే అనుకో ... కానీ నీకు భయం వెయ్యలేదా” నవ్వేశాడు పోతురాజు. అందరి పట్ల ప్రేమ నిండిన పోతురాజు హృదయం సహాయానికి చేయిచాచి ఆదుకుంటూనే వుంటుంది. అందరిలోనూ తనవారిని వెతుక్కుంటూనే వుంటాడు. అందరూ తనవారే కానీ .... పోతురాజు తన తల్లి గురించి యెప్పుడూ వేదన చెందుతూనే వుంటాడు. నిర్భాగ్యురాలైన తన తల్లి బిడ్డని కని వెంటనే వదిలేసిందంటే యెంతటి కాని పరిస్థితిలో గుండె రాయిచేసుకుందో...ఒక్కసారి తనకి కనిపిస్తే అమ్మని గుండెలో దాచుకుంటాను అనుకున్నాడు.

పాతికసంవత్సరాల కిందట యీ హాస్పిటల్ ఆవరణలోనే పుట్టాడు పోతురాజు. ఒకరోజు మునిమాపువేళ ప్రసవవేదనతో హాస్పిటల్‌కి వచ్చింది పోతురాజు తల్లి. లేతవయసులోనే దుర్మార్గానికి బలైన ఆమె తొమ్మిదినెలలూ బిడ్డబరువుతో బాటుగా లోకుల వేసిన నిందలూ మోసింది. పుట్టినబిడ్డని వదిలెయ్యడం తప్ప గత్యంతరం లేకపోయింది ఆచిట్టితల్లికి. దూరపుబంధువైన ఒకముసలమ్మ సహాయంతో హాస్పిటల్‌కి వచ్చింది. ఆడ్మిట్ అవకుండానే చెట్టు కింద పురుడు పోసుకుంది. పేగుబంధం తెంచిన ముసలమ్మ ఆకనుచీకటి వేళ బాలింతరాలితో సహా కనుమరుగైంది, చెట్లనీడల్లో కలిసిపోయింది. కేరుకేరుమని గుక్కబట్టి యేడుస్తున్న ఆపసికందుని ఆయాలూ, నర్సులూ చుశారు. ఎవరా అని వాకబు చేశారు. కానీ ఎవ్వరి జాడా తెలియలేదు. అప్పుడే పుట్టిన పసికందుని ఆయాలూ నర్సులూ చేతుల్లోకి తీసుకున్నారు. ఆవిధంగా పోతురాజు స్వంతతల్లి యెవరో తెలియకపోయినా యెంతోమంది తల్లుల చేతుల్లో పెరిగాడు. కాస్తనల్లగా బొద్దుగా పుష్టిగా వుండే అతని గొంతుక కూడా బండగా తమాషాగా వుండేది. అక్కడి స్టాఫ్ అందరి మధ్యా  ఆటబొమ్మలా తిరుగుతూ వుండే యీబాలుడిని ‘పోతురాజు’ అని సరదాగా అనేవారు, అదే పేరు స్థిరపడింది. ఆపేరుతోనే అక్కడే పెరిగి పెద్దవాడయ్యాడు. హాస్పిటల్ సూపరెండెంట్ పోతురాజుకి ఆహాస్పిటల్‌లోనే అటెండర్ వుద్యోగం యిచ్చి, అతన్ని శాశ్వతంగా అక్కడే వుండేలా చేశాడు. ఇక పోతురాజుకు హాస్పిటల్ తన ప్రపంచం. అక్కడికి వచ్చే రోగులూ వారి బంధువులూ తనవారు అని మనసు లోనమ్మకం పెంచుకున్నాడు. ఇవన్నీ నర్సులూ ఆయాల ద్వారా తెలుసుకున్న గౌతమ్‌కి అతని మీద అభిమానం  పెరిగింది. ఒకరోజు గౌతమ్‌కి క్యాజువాల్టీలో డ్యూటీ. పోతురాజు తన డ్యూటీ ముగించుకుని వెళ్తూ తొంగిచూసి ‘నమస్తే డాక్టర్‌సార్’ అంటూ పలకరించాడు. “బాగున్నావా పోతురాజు”.

ఇంతలో ముగ్గురు వ్యక్తులు ఒక నడివయస్సు వ్యక్తిని చేతులమీద మోసుకొచ్చి బెడ్డు మీద పడుకోబెట్టారు. “అయ్యా! మానాయన గుండె కొట్టుకోడం లేదండి” వాళ్లల్లో ఒకతను యేడుపు మొదలుపెట్టాడు. గౌతమ్ గబగబా వచ్చి ఆరోగిని పరీక్షించాడు. గుండె యెక్కడో పల్చగా కొట్టుకుంటోంది. మనిషి మూలుగుతున్నాడు, మూలుగు ఆక్రందనలా వుంది. ఒళ్లంతా

చెమటతో తడిసి ముద్దయింది. "అయ్యో" అనుకుంటూ నర్సుని ఎమర్జన్సీ ఇంజెక్షన్ లోడ్ చేసి తెమ్మని పురమాయించాడు. వ్యవధి ఆట్టే లేనట్టే అనిపిస్తోంది. ఇది పసికట్టిన పోతురాజు ఆ రోగి చాతీ మీద గట్టిగా తట్టి మసాజ్ చెయ్యడం మొదలుపెట్టాడు. అతని సమయస్ఫూర్తికి మెచ్చిన గౌతమ్ "గట్టిగానే చెయ్యి" అన్నాడు. నర్సు తెచ్చిన ఇంజెక్షన్ యిచ్చాడు. మసాజ్ పనిచేసిందో లేక ఇంజెక్షన్ వలనో ఆరోగి కాసేపటికి కుదుటపడ్డాడు. చెమటలు మూలుగూ కాస్త తగ్గాయి. 'హమ్మయ్య' అనుకున్నాడు గౌతమ్. "అవును...పోతురాజూ! నీడ్యూటీ అయిపోయింది కదా. మరి యిక్కడికి యెందుకు వచ్చావయ్యా?' ఆరాగా అడిగాడు. యధాప్రకారం నవ్వేశాడు పోతురాజు. "అతను అంతే సార్! తన డ్యూటీ అయిపోయాక ఓసారి వార్డులన్నీ కలయతిరుగుతాడు. ఇలాగ యేమైనా సహాయాలు చేస్తాడు." నర్సు నవ్వుతూ పోతురాజుని అభిమానంగా చూసింది. "పో చెల్లాయమ్మా!" అంటూ వెళ్లిపోయాడు. పోతురాజుకీ ఆహాస్పిటల్‌కీ వున్న అవినాభావసంబంధం రోజురోజుకీ బలపడ్తోంది. "పిల్లని చూస్తా పెళ్లి చేసుకో పోతురాజూ" చిన్నప్పుడు అతన్ని పెంచిన ఆయా ప్రేమగా అడిగింది. "నాకు పెళ్లా? ఎందుకు ఆయమ్మా?"

"ఎందుకేవిటి? ఓ ఇల్లూ యిల్లాలూ పిల్లల్లూ యేవీ వద్దా? విడ్డూరం?" వేదాంతిలా తలూపి వూరుకున్నాడు పోతురాజు. గైనిక్‌వార్డులో యేబాలింతని చూసినా తన తల్లి రూపం అస్పష్టంగా కళ్ల ముందు మెదులుతుంది. అపురూపంగా పాలు యిచ్చే ఆతల్లులకి చేతులెత్తి మొక్కుతాడు. వాళ్లు తమ చంటిపిల్లల్ని జాగ్రత్తగా చూసుకుంటున్నారా అని ఆరాగా కనిపెడుతూ వుంటాడు. ఆసాయంత్రం డ్యూటీ ముగించుకుని గైనిక్‌వార్డ్ లోపలికి వచ్చాడు. ఒకపసిపిల్ల జ్వరంతో ఆడ్మిట్ అయింది. ఆపాపని ఒకసారి చూసి పక్కనే బెంగగా కూర్చున్న తల్లిని పలకరించాడు. "డాక్టర్ సార్ మంచి మందు యిచ్చారు కదా అక్కా! తగ్గిపోతుంది." ఆమె నవ్వి వూరుకుంది. "ఏమ్మా! ఏమీ తినకుండానే కూర్చున్నావా?" మౌనంగా కళ్లు తుడుచుకుంది ఆతల్లి. మొహం నీరసంగా వుంది. "కాస్త యేమైనా తినమ్మా ... బిస్కట్లు కూల్‌డ్రింక్ తెస్తాను" అంటూ గబగబా గేటు బయటకి వెళ్తూంటే ....

ఆమునిమాపు వేళ నెత్తిన చెంగు కప్పుకుని ఒకామె గబగబా అడుగులు వేస్తూ గేటు దగ్గర కనిపించింది. పోతురాజుకి యేదో అనుమానం కలిగింది. ఇంతలో పక్కనే వున్న బెంచ్ కిందనుండి పసిబిడ్డ యేడుపు వినిపించింది. తన పుట్టుకే తిరిగి పునరావృత్తం కాబోతోందా? ఒక్క గంతులో ఆమెని చేరుకుని చెయ్యి గట్టిగా పట్టుకుని ఆపాడు. “ఎవరమ్మా నువ్వు? ఆ ఏడుస్తున్న బిడ్డ నీదేనా/” గద్దించి అడిగాడు. “అయ్యా! మీకు దణ్ణం పెడతాను. నన్ను వదలండి.” ఏడుస్తూ అంది. “విషయం చెప్పమ్మా.” ఆమె చెయ్యి పట్టుకునే పసిబిడ్డ దగ్గిరికి వచ్చాడు. ఆడపిల్ల. కాళ్లూచేతులూ కొట్టుకుంటూ యేడుస్తోంది. మెల్లిగా పాపని చేతుల్లోకి తీసుకున్నాడు.

తెల్లగా ముద్దుగా వుంది. “అమ్మా! యింత ముద్దుపాపని వదలడానికి మనసెలా వప్పిందమ్మా” బాధగా అడిగాడు. “కనీసం ప్రాణాలతోనైనా వుంటుదన్న ఆశ బాబూ.” కళ్లు ధారాపాతగా కారుతున్నాయి. “అయ్యా! ఇది నాకు నాలుగోకాన్పు. మగబిడ్డ కోసం నాభర్తా, అత్తవారూ యెంతో ఆతృతగా యెదురుచూస్తున్నారు. మళ్లా ఆడపిల్ల పుట్టిందని తెలిసి పసిగుడ్డుని చంపడానికి సిద్ధమయ్యారు. అసహాయురాలిని .. యింతకన్నా యేం చెయ్యగలను? ఇక్కడ వదిలితే యేదయగల పుణ్యాత్ముల్లో చేరదియ్యరా అని ఆశ బాబూ. కనీసం పిల్ల ప్రాణాలతో వుంటే అంతే చాలు. ఆతృప్తి దక్కితే నాబతుక్కి అదే పదివేలు.”

పోతురాజు మాట్లాడలేకపోయాడు.

ఇంతలో గేటు దగ్గర యేదో కలకలం వినబడింది. ఆమె పోతురాజు చేతుల్లో పాపని వదిలి ఒక్కపరుగున వెళ్లిపోయింది. పోతురాజు తెల్లబోయాడు. వెంటనే తేరుకుని పాపని పట్టుకుని గబగబా హాస్పిటల్‌లోకి తిరిగి వెళ్లిపోయాడు. తిన్నగా గౌతమ్‌రూమ్‌లోకి ప్రవేశించాడు. “యేమిటి పోతురాజు” నర్సు అడిగింది. “చెల్లెమ్మా! పాపని పట్టుకో. ఇప్పుడే వస్తా.” అంటూ పాపని నర్సు చేతుల్లో పెట్టి వెళ్లిపోయాడు. గేటు బయటకి వచ్చి యెంత వెదికినా ఆమె జాడ తెలియలేదు. నిట్టూర్చాడు. తనకి యీపాప భగవంతుడు ప్రసాదించిన కొత్త అనుబంధం. పెదవుల మీద చిరునవ్వు మెరిసింది. గైనిక్‌వార్డులో వున్న తల్లికి బిస్కట్లు, కాసిని పాలు కొన్నాడు. ఆమెకి బిస్కట్లు యిచ్చి మళ్లా తిన్నగా గౌతమ్ రూమ్‌కి వచ్చాడు.

"విషయం చెప్పు పోతురాజు!" అక్కడ వున్న నర్సులూ,ఆయా, గౌతమ్ ఆత్రంగా అడిగారు. వివరంగా చెప్పాడు.. "మా అమ్మ నాదగ్గిరికి వచ్చింది. నా బెంగ తీర్చడానికి ఆదేవుడే మా అమ్మని యిలా పంపాడు." పాపని మురిపెంగా యెత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు. అక్కడ వున్న అందరికీ కళ్లనీళ్లు తిరిగాయి. "యెంత మంచివాడవి కదా! నిన్ను కన్న ఆతల్లి అభాగ్యురాలు అనుకున్నాము .. కానీ నీలాంటి ప్రేమమూర్తిని కని అదృష్టవంతురాలు అయింది." గౌతమ్ అన్నాడు. "డాక్టర్‌సార్! అంత పెద్దమాటలు వద్దులెండి. అనాధగా పెరగడం యెంత శాపమో నాకు తెలుసు. ఆబాధ యీచిట్టిపాపకి కలగకూడదు. ఈపాపని నేను పెంచుతాను. ఏలోటూ రానీయను. ఇప్పటికీ మాఅమ్మని తప్పు పట్టలేను. యెందుకంటే యిప్పుడే ఒకతల్లి బాధ కళ్లారా చూశాను." వ్యధగా అన్నాడు. "అవును పోతురాజు! తల్లి కావడం అదృష్టమే కానీ ఒకొక్కసారి అదే అభిశాపం అయితే ఆతల్లి నిస్సహాయురాలు అవుతుంది. నీచేతుల్లో యీచిన్నారి అపురూపంగా పెరుగుతుంది." నర్సుపాపను ముద్దాడుతూ అంది. "సరేలే పోతురాజు మరి పాపకి యేం పేరు పెడతావు?" ఆయా సరదాగా అడిగింది. నవ్వాడు పోతురాజు ... "ఆయమ్మా! అమ్మకి పేరేంటి? పాప పేరు అమ్మే" అతని మొహంలో అంతులేని తృప్తి కనిపించింది. "నిజమే కానీ పిలవడానికి ఒకపేరు వుండాలి కదా!"

అందరూ ఆలోచించి 'అవని' అన్నపేరు నిర్ధారణ చేశారు. "అంటే" పోతురాజు అడిగాడు. "అంటే ...అవని అంటే భూమి అని అర్ధం. భూమి యెంతో మంచిది కదా. నీకూతురు కూడా అంత మంచిగా నీచేతుల్లో చల్లగా హాయిగా పెరుగుతుంది పోతురాజు నీఅంత మంచిగా" గౌతమ్ వివరించి చెప్పాడు. పోతురాజు చల్లగా నవ్వాడు. అనాధలకి పోతురాజు లాంటి ప్రేమమూర్తి అండ దొరికితే లోకమంతా పచ్చగా ప్రేమమయంగా వుంటుంది. అవని హాయిగా నవ్వుతుంది.

భారతీయులందరికీ స్వతంత్రం రూపంలో తనప్రేమను బోసినవ్వుతో అందించిన

బాపూకి అంకితం

జైహింద్!                    మీకృష్ణవేణి